నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

I | హైదరాబాద్, మంగళవారం 27 ఆగస్టు 2024 | SANGAREDDY





సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ దవాఖానకు భారీగా తరలి వచ్చిన రోగులు



సిద్దిపేట ప్రభుత్వ జనరల్ దవాఖానలో చికిత్స పొందుతున్న రోగులు

# విజృంభిస్తున్న విష జ్వరాలు



- ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు
- ఇప్పటికే ముగ్గురు డెంగీతో మృతి
- గ్రామాలు, తండాల్లో పరిస్థితి మరీ అధ్వానం
- దోమల నివారణకు క్షేత్ర స్థాయిలో చర్యలు శూన్యం
- పట్టించుకోని అధికారులు ,సిబ్బంది
- హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ప్రజల డిమాండ్



మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న రోగులు

మెదక్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ) : మెదక్ జిల్లాలోని గిరిజన తండాల్లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. ఏ తండాల్లో చూసినా మురుగు కాల్వలు శుభ్రం లేక ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దీంతో తండాల్లో జ్వరాలు ప్రబలుతున్నాయి. మెదక్ జిల్లాలో 469 గ్రామ పంచాయతీలు ఉండగా, 63 గిరిజన తండాలు ఉన్నాయి. ఈ తండాల్లో ఎక్కువ మంది గిరిజనులు జ్వరపీడితులు ఉన్నారు. వాతావరణ పరిస్థితులు, శానిటైజేషన్ లోపంతో జిల్లాలో జ్వరాలు పెరుగుతున్నాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా వంటి లక్షణాలతో ఎక్కువ మంది బాధపడుతున్నారు. దోమల వ్యాప్తితో జ్వరాలు వస్తున్నాయి. అయినప్పటికీ దోమల నివారణకు క్షేత్ర స్థాయిలో అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. మెదక్ జిల్లాలోని కౌడిపల్లి, పాపన్నపేట, చిన్నశంకరంపేట, రామాయంపేట, డి.ధర్మారం మండలాల్లో జ్వరాలు ఎక్కువగా వస్తున్నాయి. తండాలు, గ్రామాల్లో పదుల సంఖ్యతో విషజ్వరాల బారిన పడుతున్నారు. ఎక్కువ మంది బాధితులు ప్రైవేట్ దవాఖానల్లో చికిత్స చేయించుకుంటున్నారు. ఇదే అదునుగా భావించి ప్రైవేట్‌లో ఎక్కువ చార్జీలు వసూలు చేస్తున్నారు. డెంగీ వచ్చిన వారికి రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు అవుతున్నది.

### మెదక్ జిల్లాలో డెంగీతో ఇద్దరు మృతి

జిల్లాలో ఇప్పటివరకు 28 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఇవే కాకుండా ప్రైవేట్ దవాఖానల్లో కూడా పదుల సంఖ్యలో డెంగీ కేసులు నమోదవుతున్నాయి. ఈ వివరాలను వైద్యశాఖ సేకరించడం లేదు. ఇదిలా ఉండగా జిల్లాలో ఇప్పటి వరకు ఇద్దరు డెంగీతో మృత్యువాతపడ్డారు. అయితే మలేరియా కేసులు ఏమీ నమోదు కాలేదు. వైరల్ ఫీవర్ కేసులు 2576 నమోదు కాగా, టైఫాయిడ్ 32 మందికి సోకిందని వైద్యశాఖ అధికారులు చెబుతున్నారు.

### దోమల నివారణకు చర్యలు శూన్యం

మెదక్ జిల్లాలోని పల్లెలు, తండాల్లో దోమలు విజృంభిస్తున్నాయి. సాయంత్రం దోమలు ఇండ్లలోకి చేరుతున్నాయి. దీంతో ప్రజలు దోమల బారిన పడి జ్వరాలు సోకడమే కాకుండా డెంగీ బారిన పడుతున్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవడం లేదని, ఏ గ్రామంలో కూడా దోమల మందును పిచికారీ చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత వేధిస్తోంది. మెదక్ జిల్లాలో 469 గ్రామ పంచాయతీలు ఉండగా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5.68 కోట్లు రాగా, ఎస్ఎఫ్‌సీ రూ.5.30 కోట్లు వచ్చాయని డీపీవో యాదయ్య తెలిపారు. ఈ నిధులతో మల్టీ పర్పస్ వర్కర్ల జీతాల కోసం వెచ్చించడం జరిగిందన్నారు. ఎక్కడైనా డెంగీ కేసుల సంఖ్య ఎక్కువగా వస్తే ఒకటి, రెండు రోజులు వైద్యశాఖ అధికారులు, పంచాయతీ అధికారులు హడావిడి చేసి మళ్లీ పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇండ్ల మధ్య నీళ్లు నిల్వ ఉండటంతో అపరిశుభ్రతతో దోమలు పెరుగుతున్నాయి.

## సిద్దిపేటలో విషజ్వరాల పంజా

సిద్దిపేట, ఆగస్టు 26: సిద్దిపేట జిల్లా కేంద్రంలో విషజ్వరాలు పంజా విసురుతున్నాయి. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ జనరల్ దవాఖాన రోగులతో (జనరల్ వార్డు) నిండిపోయింది. జిల్లా దవాఖానతో పాటు 33 పీహెచ్‌సీలు, రెండు అర్బన్ పీహెచ్‌సీలు, ప్రభుత్వ మెడికల్ కాలేజీ జనరల్ దవాఖానలు ఉన్నాయి. నిత్యం వీటిలో ఓపీ 2800 నుంచి 3000 వరకు ఉంటుంది. ముఖ్యంగా దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులతో కూడిన జ్వరం వస్తున్నది. జిల్లా వ్యాప్తంగా టైఫాయిడ్‌కు సంబంధించి 19 కేసులు, డెంగీకి సంబంధించి 56కేసులు, ఒక మలేరియా కేసుతోపాటు వైరల్ ఫీవర్‌తో చాలామంది రోగులు బాధపడుతున్నారు. అధికారులు చెప్పిన లెక్కలకు ప్రైవేట్ దవాఖానల్లో నమోదవుతున్న కేసులకు పొంతన లేకుండా పోతున్నది. వందల సంఖ్యలో రోగులు డెంగీ, చికున్ గున్యా బారినపడుతున్నారు. ఇటీవల సిద్దిపేట పట్టణంలో ఐదేండ్ల బాలుడు మృతిచెందడంతో అధికారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. దీంతో మరోసారి జ్వర సర్వే చేసేందుకు సిబ్బంది సిద్ధమవుతున్నారు. దీనికితోడు ప్రైవేట్ దవాఖానలకు వెళ్లిన రోగులను పరీక్షలు, చికిత్స పేరిట భారీగా డబ్బులు తీసుకుంటున్నారని రోగులు వాపోతున్నారు.

## ఏరియా దవాఖానకు రోగుల క్యూ



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ఏరియా దవాఖానకు తరలి వచ్చిన రోగులు

కోహీర్, ఆగస్టు 26: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ఏరియా దవాఖానకు చికిత్స కోసం సోమవారం భారీ సంఖ్యలో రోగులు తరలి వచ్చారు. గ్రామాలు, తండాలు అపరిశుభ్రంగా తయారు కావడంతో రోగుల సంఖ్య పెరుగుతున్నది. మురుగు కాల్వలను సకాలంలో శుభ్రం చేయకపోవడంతో దోమలబడద పెరిగింది. దీంతో ప్రజలు డెంగీ, డయేరియా తదితర రోగాల బారిన పడుతున్నారు. జహీరాబాద్ దవాఖానలో 62 మందికి పరీక్షలు చేయగా అందులో 8 మందికి డయేరియా సోకినట్లు నిర్ధారించారు. దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్‌ను వివరణ కోరగా ఎనిమిది మంది డయేరియాతో చికిత్స పొందుతున్నారని, ఇంత వరకు డెంగీ నిర్ధారణ కాలేదన్నారు. కోహీర్ మండలంలోని పోతిరెడ్డిపల్లిలో ఓ వ్యక్తి, బడంపేటలో మరొకరు డెంగీతో చికిత్స పొందుతున్నారు.

## కిటకిటలాడుతున్న ప్రభుత్వ దవాఖానలు



సంగారెడ్డిలోని జనరల్ దవాఖానలోని ప్రత్యేకవార్డులో చికిత్స పొందుతున్న డెంగీ సోకిన రోగులు

సంగారెడ్డి ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలోని పల్లెలు, తండాలు విషజ్వరాలతో వణుకుతున్నాయి. పారిశుధ్య లోపం, దోమల బెడదతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు. పట్టణాల్లో ప్రభుత్వ దవాఖానలు కిటకిటలాడుతున్నాయి. ముఖ్యంగా డెంగీ కేసులు ఎక్కువ సంఖ్యలో నమోదవుతున్నాయి. టైఫాయిడ్, డయేరియా, సాధారణ జ్వరాలు, జలుబు, దగ్గు సోకిన రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. గ్రామాలు, తండాల్లో డెంగీ బారిన పడిన రోగులు చికిత్స కోసం ప్రైవేట్ దవాఖానల్లో చేరుతున్నారు. జిల్లాలో గత నెల, ఈనెల ఇప్పటివరకు గ్రామాలు, తండాల్లో 186 డెంగీ కేసులు నమోదయ్యాయి. వైద్యారోగ్యశాఖ పరిధిలోని పీహెచ్‌సీల్లో గతనెల 70 డెంగీ కేసులు నమోదు కాగా ఈనెల ఇప్పటి వరకు 116, అందోలు నియోజకవర్గంలోని తాలెల్మ పీహెచ్‌సీలో ఈనెల ఇప్పటి వరకు 30 డెంగీ కేసులు నమోదయ్యాయి. డెంగీతో పాటు జిల్లాలో టైఫాయిడ్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. గత నెల 356 టైఫాయిడ్ కేసులు నమోదు కాగా ఈనెలలో 108 కేసులు, జలుబు, దగ్గు, నిమోనియాకు సంబంధించి గతనెలలో 83 కేసులు నమోదు కాగా ఈనెల 65 కేసులు నమోదయ్యాయి. గతనెలలో 348, ఈనెలలో 210 డయేరియా కేసులు, వైద్య విధాన పరిషత్‌లోని దవాఖానల్లో గత నెల 21, ఈనెల 30 డెంగీ కేసులు నమోదయ్యాయి. డెంగీ బారిన పడిన రోగులకు పీహెచ్‌సీలతోపాటు వైద్య విధాన పరిషత్, సంగారెడ్డిలోని జనరల్ దవాఖానలో చికిత్స చేస్తున్నారు. సంగారెడ్డి జనరల్ దవాఖానలో డెంగీ రోగులకు చికిత్స చేసేందుకు ప్రత్యేకంగా ఒక వార్డు ఏర్పాటు చేశారు.

## పెరుగుతున్న సీజనల్ వ్యాధులు



సిద్దిపేట జిల్లా దుబ్బాక దవాఖానలో రోగులకు వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

దుబ్బాక, ఆగస్టు 26: సీజనల్ వ్యాధులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపల్‌తోపాటు గ్రామాల్లో విషజ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దుబ్బాక వంద పడకల దవాఖానలో 15 రోజులుగా రోగుల సంఖ్య పెరిగింది. ఇంతకు ముందు జనరల్ వార్డు లో 20 మందిలోపు ఇన్‌పేషంట్లు ఉండగా ఇప్పుడు విషజ్వరాలతో రోగుల సంఖ్య అధికమైంది. ప్రస్తుతం ఉన్న జనరల్ వార్డులో 30 బెడ్లు సరిపోక మరో వార్డులో 20 బెడ్లు ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తున్నారు. శస్త్రచికిత్సలు, ప్రసూతి అయిన వారికి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు దవాఖానలోని వెనుకభాగంలో మరోవార్డు కేటాయించారు. సోమవారం 230 మంది రోగులు ఓపీ ఉండగా, ఇందులో విషజ్వరాలతో 40 మంది ఇన్‌పేషంట్స్‌గా చేరారు.



సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రభుత్వ దవాఖానలో ఓపీ చిట్టీల కోసం క్యూలో ఉన్న రోగులు

### గజ్వేల్‌లో..

గజ్వేల్, ఆగస్టు 26 : వర్షాకాలం ప్రారంభం నుంచి గ్రామాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఈ సంవత్సరం ప్రభుత్వం పల్లెప్రగతి కార్యక్రమాన్ని నిర్వహించకపోవడంతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. దీంతో దోమల బెడదతో గ్రామాల్లో విషజ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం దోమల బెడదను నివారించేందుకు ముందస్తు ప్రణాళికతో పల్లెప్రగతి కార్యక్రమాన్ని చేపట్టింది. పల్లెల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండడంతో దోమలను నివారించారు. ప్రస్తుతం దోమలతో గ్రామాల్లో ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. జ్వర బాధితులు రోజూ పీహెచ్‌సీను ఆశ్రయిస్తున్నారు. వారం పాటు జ్వరాలు తగ్గకపోవడంతో గజ్వేల్‌లోని జిల్లా దవాఖానకు చేరుకొని చికిత్స చేయించుకుంటున్నారు. గ్రామాల్లో జ్వరంతో బాధపడుతున్న వారి వివరాలను ఆరోగ్య సిబ్బంది సేకరిస్తున్నారు.



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ సామాజిక ఆరోగ్యకేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులు

### హుస్నాబాద్ దవాఖానలో కిక్కిరిసిన రోగులు

హుస్నాబాద్, ఆగస్టు 26: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ సర్కారు దవాఖానలో సాధారణ సమయాల్లో 100నుంచి 150 మంది ఓపీ నమోదు కాగా గడిచిన 15రోజులుగా రోజూ 300 నుంచి 350కి పైగా నమోదువుతోంది. ఇన్‌పేషెంట్ల సంఖ్య కూడా రికార్డు స్థాయిలో పెరిగింది. గతంలో 10నుంచి 20మంది ఇన్‌పేషెంట్లు మాత్రమే ఉండగా ఇటీవల ఈ సంఖ్య 30నుంచి 50వరకు పెరిగింది. వైద్యులు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందిస్తున్నప్పటికీ విషజ్వరాలు, ఇతర వ్యాధులకు సరిపడా మందులు లేవనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని అందుబాటులో ఉండగా మరికొన్ని మందులు బయట తెచ్చుకోవాల్సి వస్తోందని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటల వరకు 316 మంది పేషెంట్లు దవాఖానకు రాగా సాయంత్రం వరకు మరో 40మంది రోగులు వచ్చి వైద్యం చేయించుకున్నారు. ఈరోజు దవాఖానకు వచ్చిన 316మంది రోగుల్లో 233 మంది రోగులు జ్వరం, తలనొప్పి, విరేచనాలతో బాధపడే వారు ఉన్నారు.



బైరాన్‌పల్లిలోని అమరవీరుల స్తూపం


# త్యాగాలకు నెత్తుటి సాక్ష్యం బైరాన్‌పల్లి

- రజాకార్ల దాడిలో నేలకొరిగిన 118 మంది గ్రామస్తులు
- జలియన్ వాలబాగ్‌ను మించిన నరమేధానికి 76 ఏండ్లు
- నేడు బైరాన్‌పల్లిలో అమరవీరుల సంస్మరణ దినోత్సవం
- హాజరుకానున్న మంత్రులు

మద్దూరు(ధూళిమిట్ట), ఆగస్టు 26: సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలం బైరాన్‌పల్లి ఓ నెత్తుటి సాక్ష్య ం.. అదో వీరోచిత పోరాటం.. సరిగ్గా 76ఏండ్ల క్రితం జలియన్ వాలాబాగ్‌ను మించిన నరమేధం.. మట్టి మనుషుల తిరుగుబాటు.. దోపిడీపై దండయాత్ర రజాకారు మూకలపై నిప్పు కణికలై రగిలిన నెత్తుటి మడుగు.. గడ్డి కోసిన చేతులే కొడవళ్లుపట్టాయి.. బువ్వొండిన చేతులే బందూక్‌లను పట్టాయి.. రజాకారు దాష్టికాలకు, రాక్షసత్వానికి వ్యతిరేకంగా గర్జించి పిడికిలెత్తాయి. సామాన్యులే సాయుధులై రణ నినాదం చేశారు.. రైతన్నలే అగ్ని జ్వాలలై సమరశంఖం పూరించారు. మాతృభూమి విముక్తి కోసం 118మంది వీరయోధులు చేసిన త్యాగాలకు నెత్తుటిసాక్ష్యమే ఈ 'వీరబైరాన్‌పల్లి' నేటి తరానికే కాదు భవిష్యత్ పోరాటలకు ఈ గ్రామం స్ఫూర్తి.

### గ్రామానికి చీకటి రోజు..

1948 ఆగస్టు 27న వేకువ జామున 4గంటల ప్రాంతంలో తుపాకీల మోత, తోపుల పేలుళ్లు వినిపించాయి. ఊరంతా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఏం జరుగుతుందో తెలియని అయోమయంలో గ్రామస్తులు ఉన్నారు. నిజాం సైన్యాధిపతి ఖాసీం రజ్వీ సైనికులు( రజాకార్లు) గతంలో గ్రామంలో తమకు జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకునేందుకు సుమారు 12 వందల మందితోపాటు భారీ మందు గుండు సామగ్రి, తుపాకులు, తోపులతో దొంగచాటున గ్రామంలోకి ప్రవేశించారు. ఉల్లెంగల వెంకటనర్సయ్య అనే గ్రామస్తుడిని రజాకార్లు పట్టుకోగా తప్పించుకొని రజాకార్లు గ్రామంలోకి చొరబడ్డారని కేకలు వేశాడు. దీంతో గ్రామ దళ కమాండర్ ఇమ్మడి రాజిరెడ్డి అప్రమత్తమై, ప్రజలంతా తగిన రక్షణలో ఉండేందుకు నగారా మోగించాడు. నగారా శబ్దం విన్న బైరాన్‌పల్లి వీరులు నిద్ర లేచారు. బురుజుపై కాపలాగా వున్న మోటం రామయ్య, పోచయ్య, బలిజ భూమయ్య నిద్రమత్తు వదిలించుకునేలోపే రజాకార్ల తుపాకి గుండ్లకు బలయ్యారు. గ్రామంలోకి ప్రవేశించిన రజాకార్లు దొరికినోళ్లను దొరికినట్లుగా మట్టుపెట్టారు. ఇంటింటికీ తిరిగి 92మందిని నిలబెట్టి కాల్చి చంపి వారి రక్త దాహాన్ని తీర్చుకున్నారు. శవాల చుట్టూ మహిళలను వివస్త్రలుగా చేసి బతుకమ్మ ఆడించారు. దాడిలో 25మంది రజాకార్లు చనిపోగా, 118మంది గ్రామస్తులు చనిపోయారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. కూటిగల్ గ్రామంపై పడి 30 మందిని పొట్టన పెట్టుకున్నారు.




సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలం బైరాన్‌పల్లి గ్రామంలోని సమరయోధులు(ఫైల్)

### నేడు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

బైరాన్‌పల్లిలో 76వ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితోపాటు అన్ని రాజకీయ పార్టీల నాయకులు హాజరుకానున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన జ్యోతిరావుపూలే, సావిత్రిబాయిపూలే విగ్రహాలను మంత్రులు ఆవిష్కరించనున్నారు.

